

సమస్యలు పరిష్కరించకుంటే..

జైలుకైనా సిద్ధం

ప్రజాసంఘాలు, ట్రేడ్ యూనియన్ నేతల హెచ్చరిక




రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాలు, ట్రేడ్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం గత 29 రోజులుగా, మున్సిపల్ పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ కార్మికులు గత 17 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిద్రపోయినట్టు నటిస్తూ కార్మికవర్గాన్ని మోసం చేస్తున్నదని ట్రేడ్ యూనియన్, ప్రజాసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రభుత్వ తీరును నిరసిస్తూ స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట వేలూరు తిరుపతి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా నాయకులు చైతన్య, వాడ గంగరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇదే తరహాలో ప్రభుత్వం వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎస్మా చట్టాన్ని ఉపయోగించి జీవో నెంబర్ 2 విడుదల చేసి భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ఎస్మా చట్టాన్ని ఎవరి పైన ఉపయోగించాలో తెలియని పరిస్థితిలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో జైలుకి ఎళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు ట్రేడ్ యూనియన్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ నాగరాజు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, కెవిపిఎస్ నాయకులు ఈశ్వర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబుల్ రాజు, ఐద్వా జిల్లా నాయకులు భువనేశ్వరి, లతా రెడ్డి, డిహెచ్పిఎస్ నాయకులు దాసరి చంద్ర, ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి విజయ గౌరీ, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

'బోస్'కేనా టిక్కెట్..!

శరవేగంగా 'పలమనేరు' పరిణామాలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లిస్టులో పలమనేరు సిట్టింగ్ ఎంఎల్‌ఎ వెంకటేగౌడ లేరు. రెండోసారి జరిపిన సర్వేలో అభ్యర్థిని మార్చకపోతే అధికార పార్టీకి కష్టమేనని నివేదికలు తెలిపాయి. దీంతో రెండో విడత అభ్యర్థుల జాబితాలో మార్పులు జరుగుతున్నాయి. మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆహ్వానం మేరకు వైసిపి తీర్థం పుచ్చుకున్న సుభాష్ చంద్రబోస్ రాజకీయాల్లో స్తబ్ధతగా ఉన్నారు. అయితే పెద్దిరెడ్డి అనుయాయుడు కావడంతో జగన్మోహన్‌రెడ్డికి 'బోస్' కుటుంబ రాజకీయాలను వివరించి అమరనాథ్‌రెడ్డిని ఎదుర్కోవాలంటే బోస్ ఒక్కడే ధీటైన వ్యక్తని చెప్పినట్లు సమాచారం. ఇప్పటికీ సిట్టింగ్ ఎంఎల్‌ఎ వెంకటేగౌడ మాత్రం ఎటువంటి పరిస్థితుల్లోనూ జగన్ తనకే సీటు వస్తారనే ధీమాతో ఉన్నారు. 2014లో అమరనాథరెడ్డిపై పోటీగా టిడిపి అభ్యర్థిగా నిలబడి ఓటమిని చవిచూశారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు బోస్ ఓడిపోయినప్పటికీ పలమనేరు ఇన్‌ఛార్జి బాధ్యతను బోస్‌కే కట్టబెట్టారు. 2014లో అధికారంలోకి రాగానే ఎంఎల్‌ఎల 'ఆకర్ష్' పథకానికి ఆకర్షితుడై టిడిపి తీర్థం పుచ్చుకున్నాడు. బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డికి ఉన్న మంత్రి పదవిని తొలగించి, అమరనాథ్‌రెడ్డికి పరిశ్రమల శాఖ మంత్రిగా కట్టబెట్టారు. ఇన్‌ఛార్జిగా ఉన్న తనకు ఏమాత్రం తెలియజేయకుండా నిర్ణయం తీసుకున్నారన్న 'కోపం' బోస్‌కు ఉంది. దీంతో వైసిపి అధికారంలోకి రాగానే వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌లోకి వెళ్లలేదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏడాది క్రితం పెద్దిరెడ్డి ద్వారా వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో పలమనేరు వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా బోస్ నిలబడతారని చర్చ జోరుగా నడుస్తోంది.

నోటీసులకు భయపడేది లేదు


చిత్తూరులో రిలే దీక్షల్లో నిరసన తెలుపుతున్నఅంగన్వాడీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంగన్వాడీల సమ్మె 29వ రోజుకు చేరింది. మంగళవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద నాలుగవ రోజు రిలే దీక్షలు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దుర్మార్గంగా ప్రయోగించిన ఎస్మా జీవో 2 కాపీలను అడ్డం పెట్టుకొని జిల్లా అధికారులు నోటీసులు ఇస్తూ బెదిరింపులు పాల్పడడం సిగ్గుచేటు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా అంగన్వాడీల ఉద్యమంపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ఆగ మేఘాల మీద జీవో నెంబర్2 తీసుకువచ్చి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయోగిస్తుండడం అత్యంత దారుణమన్నారు. ఇలాంటి బెదిరింపులకు అంగన్వాడీ ఉద్యమం చాలా చూసిందని ఎస్మా లాంటివి ఎన్ని చట్టాలు తెచ్చిన ఉద్యమ ఆగదని, సమస్యలు పరిష్కారం చేస్తేనే ఉద్యమం సాగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రయోగాలు చేయడం మానేసి సమస్యలను పరిష్కారం చేసే దిశగా అడుగులు వేయాలని హితవు పలికారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ షకీలా, సిఐటియు జిల్లా కార్యదర్శి కే.సురేంద్రన్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ప్రభావతిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తీవ్రంగా ఖండించారు. ఈ పోరాటానికి మద్దతుగా ఎస్టియు రాష్ట్ర కార్యదర్శి గంటా మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి భువనేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ, మున్సిపాలిటీ, ఎస్ఎస్ఏ కార్మికులందరూ సమ్మెబాట పట్టారని, ఎన్నికలు దగ్గర్లో ఉన్న బెదిరింపులు పాల్పడుతున్న ప్రభుత్వాన్ని ఇంటికి పంపించే పనిలో అంగన్వాడీలు ఉంటారని హెచ్చరించారు. సుజిని, పద్మ, శోభ, పంచవర్ణ, ధనకోటి, ఎర్రమ్మ, లీలావతి పాల్గొన్నారు.

కుప్పం: కుప్పం పట్టణం ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో మండల పరిధిలోని అంగన్వాడీ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 29వ రోజుకు చేరుకుంది. గత నెల రోజులుగా నిరవధిక నిరసన దీక్షలు నిర్వహిస్తున్న తమ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదంటూ అంగన్వాడీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ తమ చీరలను ఉరితాలుగా వేలాడదీసి తమ నిరసనను కొనసాగించారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు మద్దతుగా కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు దీక్షా శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదని, అంగన్వాడీలు ఐక్యమత్యంగా ఉంటే ఎవరు ఏమి చేయలేరంటూ మనోధైర్యాన్ని కల్పించారు. మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, నియోజకవర్గ పార్టీ విస్తరణ కమిటీ సభ్యులు కన్నన్, బాబు, రాజారామ్, సురేష్ పాల్గొన్నారు.



కుప్పంలో ఉరి తాడ్లతో నిరసన

న(కు)య్..న(కు)య్..!



- 23 నుంచి సమ్మెలోకి..108, 104 సిబ్బంది
- నాలుగు నెలలుగా జీతాల్లేవ్..
- రెగ్యులర్ చేయాలన్నదే డిమాండ్..

ప్రజాశక్తి - తిరుపతి : ఏపీలో ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఉద్యోగ, కార్మిక వర్గాల సమ్మెలు ఉధృతమవుతున్నాయి.. ప్రభుత్వ హామీలు నెరవేరుతాయని నిరీక్షించిన వీరు సహనం నశించి సమ్మెలోకి దిగుతున్నారు. ఇప్పటికే అంగన్ వాడీ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు విధులు బహిష్కరించి రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేస్తుండగా.. ఇప్పుడు వీరితో పాటు 104, 108 అత్యవసర సర్వీసుల ఉద్యోగులు సంక్రాంతి తరువాత సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. నాలుగు నెలలుగా జీతాల్లేక అవస్థలు పడుతున్న వీరు, రెగ్యులర్ చేయాలన్నది ప్రధాన డిమాండ్. 'కుయ్‌కుయ్' అంటూ రోగులకు అత్యవసర సేవలు అందిస్తున్న వీరు 'కుయ్యో మొర్రో' అంటూ సమ్మెకు సమాయత్తం అవుతున్నారు. ఈ సమ్మెలన్నీ ప్రభుత్వ స్వయంకృతాపరాధమే కావడం గమనార్హం. ప్రమాదాలు చోటుచేసు కున్నాయని సమాచారం అందిన వెంటనే స్పందించే 108 అంబులెన్సు సిబ్బందికి నేడు జీతాల కష్టాలు ఎదురవుతు న్నాయి.. సకాలంలో వేతనాలు అందక, ఆర్థిక ఇబ్బందులతో వున్న 102, 104, 108 అంబులెన్స్ సిబ్బంది సైతం ఆందోళన బాట పట్టనున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 108 అంబులెన్సులు 54 ఉండగా అందులో 200 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 104 అంబులెన్సుల్లో 108 మంది, 102 అంబులెన్సుల్లో 23 మందికి పైగా వున్నట్లు తెలుస్తోంది. ఈ ఉద్యోగులందరికీ నాలుగు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. వీరి జీతాలు కాంట్రాక్టు సంస్థే చెల్లించాలని, ప్రభుత్వ అధికారులు చేతులు దులుపు కుంటుండటం గమనార్హం. కొంతకాలంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అత్యవసర సేవల సిబ్బంది జనవరి 23వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 22లోగా తమ సమస్యలు పరిష్కరించకపోతే 23వ తేదీన సమ్మెలోకి వెళ్లనున్నట్లు 104, 108 సర్వీసుల ఉద్యోగులు తాజాగా ఆరోగ్యశ్రీ సీఈవోకు తమ సమ్మె నోటీసుల్ని అందజేశారు. తమ సమస్యల పరిష్కారం విషయంలో ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతోనే నోటీసులు ఇచ్చినట్లు వారు చెబుతున్నారు. 22 వ తేదీ వరకూ ప్రభుత్వానికి డెడ్ లైన్ పెట్టినా అప్పటి వరకూ నిరసనలు కొనసాగిస్తామని, అప్పటికీ పరిష్కారం కాకుంటే మాత్రం 23న తప్పనిసరిగా సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధమవడం గమనార్హం.దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

సమ్మె దిశగా 108 ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 ఉద్యోగులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు 108 ఉద్యోగులు మంగళవారం డిఆర్ఓ రాజశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఏవోలకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ అత్యవసర సేవలందిస్తున్న 108 ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకుంటే సమ్మెకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ 108 ఉద్యోగులను క్రమబద్ధీకిస్తామని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే సమ్మె చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.


డిఆర్ఓకు సమ్మె నోటీసు అందిస్తున్న 108 ఉద్యోగుల సంఘం నాయకులు

భూసేకరణలో రైతులకు న్యాయం : జెసి


రైతులతో మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే 2వ దశ పనులకు సంబంధించి భూసేకరణలో భాగంగా రైతులకు న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ (జెసి) పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పలమనేరు ఆర్‌డిఓ కార్యాలయంలో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ చెన్నై – బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే 2వ దశ పనులకు సంబంధించి భూసేకరణలో భాగంగా భూమి కోల్పోతున్న రైతులతో, పలమనేరు ఆర్‌డిఓ, పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, బంగారుపాళెం తహశీల్దార్లతో అవార్డ్ పాస్‌చేసే అంశంపై చర్చించారు. ఈసందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ హైవే 2వ దశ పనులు చేపట్టేందుకు అవార్డ్ పాస్ చేసే విషయంలో కోర్టులలో భూతగాదాలలో ఉన్న భూములు, ఇప్పటివరకు నష్టపరిహారం జమకాని రైతులతో సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై సంబంధిత తహశీల్దార్లతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. భూమి కోల్పోయిన రైతులలో ఇంకనూ మిగులు భూమి ఉన్న పొలాలకు దారిని చూపాలని పలువురు రైతులు ఇంచార్జ్ కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా ఈ సమస్య పరిష్కరించేందుకు రైతులకు హామీఇచ్చారు. పలమనేరు ఆర్‌డిఓ మనోజ్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్‌లు కుప్పుస్వామి, కుమారస్వామి, చిట్టిబాబు, అనిల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అవసరం లేని వాటిని తొలగించండి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని ఖజానా కార్యాలయాల్లో స్ట్రాంగ్ రూమ్‌లలో వివిధ ప్రభుత్వ శాఖలు భద్రపరచిన ఎన్నికలకు సంబంధించిన వస్తువులను పరిశీలించి, అవసరం లేని వాటిని తక్షణమే తొలగించాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరంలో జిల్లా ఖజానా కార్యాలయాలలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచిన వస్తువులపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న సాధారణ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఖజానా కార్యాలయాలలో ఎన్నికల సామాగ్రి నిల్వ చేయడం జరుగుతుందని, ఈ కారణంగా వివిధ శాఖలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, ఫైల్‌లు, వస్తువులను తొలగించేందుకు రాష్ట్ర ఖజానా శాఖ జిల్లాస్థాయిలో ఒక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల్లో శాఖలవారీగా భద్రపరచిన వస్తువులను తిరిగి తీసుకొనేవి, తొలగించవలసినవి, భద్రపరచాల్సినవి గుర్తించేందుకు సమావేశంలో నిర్ణయించామని పేర్కొన్నారు. న్యాయపరంగా సమస్యలను లేని ఫైల్‌లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జిల్లా ట్రెజరీ అధికారి ఎం.రామచంద్ర, జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, జిల్లా రిజిస్ట్రార్ రామచంద్ర పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



కుప్పంలో..

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి పక్షంరోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరిన పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు అందించడంతోపాటు ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగానే మంగళవారం మున్సిపల్ కార్మికులు భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. సమస్యలు పరిష్కార అయ్యేంతవరకు సమ్మెను విరమించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. సిపిఐ నగర కార్యదర్శి గోపీనాథ్, మనీ, దాసరి చంద్ర, వాసు, సుగుణ, సురేష్, రమణి, ఈశ్వర్, వినాయకపాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో మంగళవారం 7వ రోజు మున్సిపల్ కార్మికుల సమ్మెను కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. యూనియన్ నాయకులు ఆనంద్, శ్రీనివాసులు, బాబు, వెంకటేష్, వాసు, బాలాజీ, వెంకట రమణమ్మ, అరుణమ్మ, లక్షుమ్మ పాల్గొన్నారు.


పలమనేరులో..

వార్షిక ప్రణాళికల తయారీపై శిక్షణ



వార్షిక ప్రణాళిక సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి సీఈవో

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, చిత్తూరు: గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించి 2024- 25 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం జెడ్పీ సమావేశపు మందిరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి వార్షిక ప్రణాళికా 2024- 25పై జిల్లాస్థాయి అధికారులు, ఎంపీడీఓలు, ఈఓ పిఆర్ అండ్ ఆర్‌డి, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈలు, మండలానికి ఒక పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రెండురోజుల శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపరచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన అంశాలతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో అవసరమైన అంశాలను కూడా ప్రణాళికలో పొందుపరచాలన్నారు. వార్షిక ప్రణాళికల తయారీలో భాగంగా నిర్వహించే గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించడానికి ప్రాంతాల వారీగా ప్రజాప్రతినిధులతో పాటు, స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. గ్రామసభల నిర్వహణ తేదీని గ్రామ పంచాయతీ సెక్రెటరీల ద్వారా, టాంటాంలు వేయడం, నోటీసులు అతికించడం ద్వారా ప్రతి గడపకు తెలిసేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీలో గ్రామ పంచాయతీ ప్లానింగ్ ఫెసిటేషన్ టీం ఏర్పాటు, గత జిపిడిపి అమలు నివేదిక తయారీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల టీముల ఎంపిక, బాల, మహిళా సభల నిర్వహణ, చిత్తు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీ, రిసోర్స్ ఎన్వలప్ లేదా ఆర్థిక వనరుల తయారీ, మొదటి గ్రామసభ వివరాలు వెబ్ సైటులో నమోదు, మొదటి గ్రామసభ నిర్వహణ, ప్రణాళికా పనులు, నిధుల కేటాయింపు వంటి దశలు ఉంటాయని తెలిపారు. డిఆర్డీఏ పిడి తులసి మాట్లాడుతూ దేశానికి పునాదులు పంచాయతీలని, అలాంటి గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన వార్షిక ప్రణాళికలను ప్రతి సంవత్సరం తయారు చేయడం ఆనవాయితీ అని, గ్రామ పంచాయతీల వార్షిక ప్రణాళికల తయారీలో ఎంపిడిఓలు కీలకపాత్ర పోషించడం జరుగుతుందన్నారు. మండల సమాఖ్యకు సంబంధించి అంశాలను కూడా ప్రణాళికలో పొందుపరచాలన్నారు. డిపిఓ లక్ష్మీ, డిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగ రామ్, డిఎస్ఓ శంకరన్, డిడి ఫిషరీస్ శ్రీనివాసరావు, డ్వామా ఏపిడి ఉమావాణి, తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యదర్శులతో సమీక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్


వార్డు కార్యదర్శులతో సమీక్షిస్తున్న కమిషనర్

వార్డు సచివాలయం స్థాయిలో నిర్వహించాల్సిన పలు కార్యక్రమాలపై నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం వార్డు కార్యదర్శులు, సీవోలు, ఆర్పీలతో వీడియో సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర, జగనన్న ఆరోగ్య సురక్ష-2, జన్ భాగీదారి కార్యక్రమాల నిర్వహణపై వార్డు కార్యదర్శులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్ భాగీదారి కార్యక్రమాలను వార్డు సచివాలయం స్థాయిలో పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నగరపాలక పరిధిలో బుధవారం 43, 12వ వార్డు సచివాలయాల్లో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. వైద్యశిబిరానికి హాజరయ్యే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. నగరపాలక పరిధిలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర మున్సిపల్, మండలస్థాయి పోటీలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. క్రీడల నిర్వహించే నాలుగు మైదానాల్లో చేపట్టిన ఏర్పాట్లను మరొకసారి సరి చూసు కోవాలన్నారు. సమావేశంలో సీఎంఎం గోపి పాల్గొన్నారు.

'జన్ భాగీదారి'లో భాగస్వాములు కండి: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ పుష్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జన్ భాగీదారి' కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని నగర కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. జన్ భాగీదారి కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న 'సామాజిక సమతా సంకల్ప యాత్ర' కార్యక్రమాల నిర్వహణ, సంఘాల భాగస్వామ్యంపై మంగళవారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11వ తేదీ వరకు వార్డు సచివాలయం స్థాయిలో అంబేద్కర్ చిత్రపటాలు, జిల్లాస్థాయిలో విగ్రహాలకు పూలమాల వేయడం, సంతకాల సేకరణ, మారథాన్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. సీఎంఎం గోపి, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.బాబు, ఎ.దేవరాజులు, సి.ఎల్లప్ప, ఎం.డేవిడ్, వి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ క్లీనిక్‌లో సేవలకు ప్రశంస

ప్రజాశక్తి- నగరి : వైఎస్సార్ అర్బన్‌హెల్త్ క్లినిక్ ద్వారా ప్రజలకు సకాలంలో అద్భుతంగా వైద్య సేవలందిస్తున్నారని డిల్లీ నుంచి విచ్చేసిన కేంద్ర వైద్యసేవల క్వాలిటీ అభివృద్ధి పరిశీలన బృందం సభ్యులు డాక్టర్ దీపక్ డోంగ్రే, డాక్టర్ నిషథావన్ ప్రశంసించారు. మంగళవారం నగరి మున్సిపల్ పరిధి సత్రవాడలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లీనిక్‌ను వారు పరిశీలించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, అత్యవసర సేవలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ పరీక్షలు, పరిశుభ్రత, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు అందుతున్న సేవలపై రోగులను ఆరా తీశారు. అర్బన్ హెల్త్‌సెంటర్లలో అందుబాటులో ఉండటంపై వారు ప్రశంసల జల్లు కురిపించారు. జిల్లా క్వాలిటీ అసెస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ నిరంజన్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎయిళ్‌అరసన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



దత్తత గ్రామం దరహాసపూరితం

ప్రజాశక్తి- నగరి: తాను దత్తత తీసుకున్న గ్రామంలో మంత్రి ఆర్కేరోజా మంగళవారం పర్యటించారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తమగ్రామ రూపురేఖలు మార్చిన మంత్రిని చూడగానే స్థానికులు ఆనందంతో పరవశించిపోయారు. ఆమెను పలకరిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తమ గ్రామంలో ఎలాంటి వసతులు లేక ఇదివరలో అవస్థలు పడేవారమని నేడు 8 వీధులకు సిమెంటురోడ్లు వేశారని, 18 విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసి 30 వీధి దీపాలు అమర్చారని, గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలం లేకున్నా ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేయించి అక్కడ 52 ఇళ్లు కట్టిస్తున్నారని, గ్రామంలోనే వైద్య శిబిరం పెట్టి వైద్యసేవలు అందించారని, మా గ్రామ పాఠశాల కార్పొరేట్ స్థాయికి నేడు మారిందంటూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులతో కలిసి ఆమె నూతనంగా నిర్మాణంలో ఉన్న నివాసాలను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న కొన్ని సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా వాటిని తాను పరిష్కరిస్తానన్నారు. నిర్మాణ ప్రాంతంలో వర్షానికి నిల్వచేరిన నీటిని అధికారుల ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎప్పుడూ పేదలకు, నిరాశ్రయులకు అండగా ఉంటుందన్నారు. సాయం అందించడంలో తానెప్పుడూ ముందుంటానన్నారు. అందరి ఆశీర్వాదం తనకు, జగనన్నకు ఎప్పుడూ ఉండాలని కోరారు. ఎంపీటీసీ ఇమ్రాన్‌ఖాన్, సర్పంచ్ నందిసితేష్, హసీమ్, ఎస్‌ఎం భాషా, పీవన్ గౌస్, అబ్దుల్ ఖాదర్, వేలు, బాలాజీ, దేవమందడి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'విజయం' వార్షికోత్సవ వేడుకలు



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఐసిఐసిఐ బ్యాంకు మేనేజర్ జనార్దన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక సుందరరాజపురం విజయం సివిఎస్ఇ పాఠశాల నాలుగో వార్షికోత్సవం మంగళవారం స్థానిక ఆర్‌వీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీడీ నెల్లూరు ఎంఈఓ గుణశేఖర్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ విజయం విద్యాసంస్థలు ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతోందని అన్నారు. ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజర్ జనార్దన్ మాట్లాడుతూ చక్కటి వాతావరణంలో విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యాబోధన చేస్తూ విజయాలను విజయం విద్యాసంస్థ సాధించిందన్నారు. విజయం విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు అత్యంత క్రమశిక్షణతో మెలుగుతున్నారని తెలిపారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులను అత్యంత క్రమశిక్షణతో ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. సాంకేతికపరంగా తమ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ముందంజలో ఉన్నట్లు చెప్పారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలజామూర్తి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంఘటితరంగ కార్మికులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అసంఘటితరంగ కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టు న్యాయసదన్ భవనంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ, జిల్లా కార్మికశాఖ ఆధ్వర్యంలో అసంఘటీతరంగ కార్మికులకు అవగాహన సదస్సు, ఈ శ్రమ పోర్టల్‌లో నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం సుప్రీంకోర్టు, హైకోర్టు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ అనేక చట్టాలను తీసుకోవడం జరిగిందని అసంఘటితరంగ కార్మికులు కార్మిక చట్టాల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు, కేంద్ర ప్రభుత్వం అందజేసే ఈ శ్రమ కార్డులు తీసుకోవాలన్నారు. 18 నుండి 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన భవన, ఇతర నిర్మాణ కార్మికులు అర్హులని, చలాన్ రూ.110లు చెల్లించి సంబంధిత లేబర్ ఆఫీసర్‌కు అందజేసి గుర్తింపు కార్డు పొందాలన్నారు. ఇతర వివరాలకు 94925 55223 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: విజయవాడలో 100 అడుగుల ఎత్తుతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహం గురించి ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఇన్చార్జ్ ఎంపీడీవో సుధాకర్, మండల వైస్‌ఎంపీపీ హరిబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఎంపీడీవో ఆఫీస్‌లో అంబేద్కర్ చిత్రపటానికి అధికారులు, నేతలు కలిసి పూజలు చేసి నివాళు లర్పించారు. మండల ఉపాధి ఏపీఓ శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం చిరంజీవి, జూనియర్ అసిస్టెంట్ సుభాష్ చంద్రబోస్, చంద్రబాబు పాల్గొన్నారు.

సదుం: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రాజధానిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాట్లు చేస్తున్న సందర్భంగా మంగళవారం సదుం నడిగడ్డ గ్రామ సచివాలయ కార్యాలయంలో సంఘీభావం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నారాయణరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు సంతకాలు చేసి వారి సంఘీభావం తెలిపారు.

సోమల: రాష్ట్ర రాజధాని అమరావతిలో బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందించదగ్గ విషయమని కందూరు సర్పంచ్ భాషా మసూద్ అన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సంఘీభావంగా గ్రామ సచివాలయంలో సంతకాలసేకరణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జయశంకర్ అంబేద్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయమార్గంలో నడుస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.

వైసిపి అరాచకాలకు గుణపాఠం చెప్పాలి : చల్లా

ప్రజాశక్తి- పుంగనూరు: వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామిక రంగంలో ఉన్న పరిశ్రమలు కమిషన్ ఇవ్వలేక ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాయని, నిరుద్యోగ యువత పెడదారి పట్టారని నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి ఆరోపించారు. మండలంలోని నేతి గుట్టపల్లి పంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిశ్రమలు ఏర్పాటు చేసినందుకు కమిషన్ కక్కుర్తిపడడంతో ఉన్న పరిశ్రమలన్నీ తరలి వెళ్ళిపోవడం జరిగిందన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు లేక పెడదారి పట్టారని వారి జీవనం వైసిపికి శాపాలుగా మిగులుతాయన్నారు. టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని యువతకు ఉద్యోగ అవకాశాలు, రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేస్తారని తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో జరుగుతున్న అరాచకాలు ప్రజల గమనిస్తున్నారని తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రూరల్ అధ్యక్షుడు మాధవరెడ్డి, బాలాజీ, చిన్న మోహన్ నాయుడు, సయ్యద్ సుహేల్ బాష పాల్గొన్నారు.

'ప్రజాసంకల్ప పాదయాత్ర'కు ఐదేళ్లు పూర్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం వైసిపి నేతలు స్థానిక విద్యానందరెడ్డి కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్ర సందర్భంగా ప్రజాసమస్యలను గుర్తించి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. ఏ మేరకు రూపొందించిన నవరత్నాలు కార్యక్రమంలో ప్రజాసంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ప్రజాభిమానాన్ని చురగొన్న జగన్మోహన్ రెడ్డి తిరిగి విజయం సాధించడం ఖాయమన్నారు.

బాలకార్మిక రహిత జిల్లాగా మారుద్దాం

సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బాల కార్మికుల రహిత జిల్లాగా చేయుటకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకోర్టు, న్యాయసదన్ భవనంలో బాలకార్మికుల హక్కులకు సంబంధించి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల కార్మికుల రహిత జిల్లాగా తయారు చేయడానికి సంబంధితశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు జిల్లాలో సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే కార్మికచట్టం ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకొని జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తుంటే వారిని గుర్తించి సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందజేయాలన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులను అరికట్టాలి..

పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టు న్యాయసదన్ భవనంలో జడ్జి మీడియాతో మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశాలు, కార్యాలయాలలో మహిళలపై లైంగిక వేధింపులు నివారణకు సంబంధిత సంస్థలు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు పనిచేసే ప్రాంతాలలో స్వేచ్ఛ వాతావరణం కల్పించాలన్నారు. మహిళలపై వేధింపులు జరుగుతుంటే వాటి నివారించేందుకు 2013లో చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. వర్క్‌ప్లేస్‌లో మహిళలకు లైంగిక వేధింపులుంటే వెంటనే అంతర్గత ఫిర్యాదుల కమిటీకి మహిళలు పిర్యాదు చేయాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యాలయాలలో మహిళలపై వేధింపు ఫిర్యాదులుంటే సంబంధిత శాఖల అధికారులు ఆ సమాచారాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు పంపించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

మున్సిపల్, మండల స్థాయి పోటీలు ప్రారంభం



ఆడుదాం ఆంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో, కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వార్డు స్థాయిలో విజయవంతంగా జరిగిన "ఆడుదాం ఆంధ్ర" పోటీల్లో గెలుపొందిన వారితో మండల, మున్సిపల్ స్థాయి పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. 'ఆడుదాం ఆంధ్ర' మండల, మున్సిపల్‌స్థాయి పోటీలను విజయవంతం చేయడంలో భాగంగా మంగళవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ర్యాలీని కమిషనర్ అరుణ, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, సుధాకర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయని, ఈ పోటీల్లో గెలుపొందిన వారితో మున్సిపల్, మండల స్థాయి పోటీలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. క్రీడల నిర్వహణకు సంబంధించి మైదానాలను సిద్ధం చేశామని, అన్ని క్రీడాజట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. క్రీడల విశిష్టతను తెలియజేస్తూ ప్రజలను భాగస్వామ్యం చేయడం కోసం ర్యాలీని నిర్వహిస్తున్నట్లు వివరించారు. 'ఆడదాం ఆంధ్ర' క్రీడల్లో ఔత్సాహిక ప్రజలు, యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఎంఈవో-2 మోహన్, పీడీలు, మహిళలు పాల్గొన్నారు.

కార్వేటినగరం : ఆడుద్దాం.. ఆంధ్రా క్రీడలను గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో మోహన్ మురళీ ఆధ్వర్యంలో ఆడుద్దాం.. ఆంధ్ర క్రీడలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు విజయ కుమార్, మనోజ్ కుమార్, ఈవో మణి, పీడీలు మురళీ కృష్ణంరాజు, మాండవ్య, తిరుమలరాజు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని యూనివర్సల్ పాఠశాల గ్రౌండ్‌లో నేటి నుంచి మూడు రోజులపాటు జరిగే ఆడుదాం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం విద్యార్థులకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

సోమల: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 10వ తేదీ బుధవారం నుంచి 20వ తేదీ వరకు మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు, ఎంఈఓ శివరత్న, పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ అమరావతి కోరారు. ఇన్చార్జ్ ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సింగల్ విండో చైర్మన్ దత్తిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, ఎంఈఓలు నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహించారు. మంగళవారం ఎంపీడీవో ప్రేమ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ మండలంలో ఉన్న పంచాయతీలలో గెలిచిన జట్లను ఫైనల్‌గా ఆడించేందుకు మండల కార్యాలయం ఆవరణం వెన్నుక భాగంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

గణిత ఫోరం నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్ శివప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంకు గణిత ఉపాధ్యాయులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణారెడ్డి ద్వారా అనువర్తిత గణితంపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా విద్యా శిక్షణ సంస్థ విశ్రాంత సీనియర్ ఆధ్యాపకులు మునిరత్నం గణితం సర్వ శాస్త్రాలకు మూలమని, గణిత అధ్యయనం మిగతా శాస్త్రాల అధ్యయనానికి మూలాధారమని తెలియజేశారు. విజయం కళాశాల డైరెక్టర్ తేజోమూర్తి భావి భారత పౌరుల భవిష్యత్తు గణిత ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఇదే కార్యక్రమంలో దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించిన బోధన అభ్యసన సామాగ్రిని ప్రదర్శించి సామాగ్రి రూపకర్త, గణిత ఫోరం రాష్ట్ర కార్యదర్శి నామ చంద్రశేఖర్, వివిధ రకాలైన బోధనాపేక్షన సామాగ్రిని ఎలా ఉపయోగించాలో ప్రదర్శించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణిత ఫోరం ప్రధాన కార్యదర్శి గంగులపూడి భాస్కర్ రెడ్డి మార్చి నెలలో పరీక్షకు హాజరవుతున్న పదవ తరగతి విద్యార్థులకు గణితంలో సులభంగా పాస్ అవడానికి అవసరమైన మెలుకులను తెలియజేశారు. నూతన చిత్తూరు జిల్లా గణిత ఫోరం కార్యవర్గాన్ని ఎన్నికల పరిశీలకులు నామా చంద్రశేఖర ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. నూతన జిల్లా ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం అధ్యక్షులుగా ఎం.చంద్రమ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా డి.వేణుగోపాల్ రెడ్డి, కోశాధికారిగా మనోహర్, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా జయశ్రీ, జయంతి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా హరిప్రియలు ఎన్నికయ్యారు. జిల్లాలోని నలుమూలల వివిధ పాఠశాల నుంచి టిఎల్ఎంను గణిత ఉపాధ్యాయులు ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జెడ్ఎస్ఎస్ కోఆర్డినేటర్ త్యాగరాజు నాయుడు రూ.10వేలు, గణిత ఉపాధ్యాయురాలు తేజ రూ.5వేలు నగదును విరాళంగా అందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంతి ప్రొఫెసర్ రాధాకృష్ణారెడ్డి

యుటిఎఫ్ నాయకులకు నోటీసులు

ప్రజాశక్తి- యాదమరి : యుటిఎఫ్ టీచర్స్ యూనియన్ చిత్తూరు జిల్లా కౌన్సిల్ కార్యదర్శి సురేష్‌కు సోమవారం అర్ధరాత్రి పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈనెల 10వ తేదీ విజయవాడలో యుటిఎఫ్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 36 గంటల ధర్నా కార్యక్రమంకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంకు వెళ్లకూడదని యాదమరి పోలీస్ సిబ్బంది సోమవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో టీచర్స్ యూనియన్ నాయకులకు నోటీసులు ఇచ్చారు. ఈసందర్భంగా చిత్తూరు జిల్లా యుటిఎఫ్ టీచర్స్ యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి మాట్లాడుతూ సురేష్ మాట్లాడుతూ టీచర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని యూనియన్ తరపున చేస్తున్న పోరాటాలకు ప్రభుత్వం అడుగడుగునా ఇబ్బందులు గురి చేస్తుందని, ప్రజాస్వామ్యమని పోలీసులను అడ్డుపెట్టుకొని పోరాటాలను ఆపడం ఎవరితరం కాదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించే వరకు యుటిఎఫ్ పోరాటాలలో ముందుంటుందని తెలిపారు.

రైల్వే గేట్ ట్రాఫిక్ సమస్యకు పరిష్కార 'మార్గం'

పనులను పరిశీలించిన మంత్రి ఆర్కే రోజా

ప్రజాశక్తి- నగరి : మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం రైల్వే గేట్ ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు మంత్రి ఆర్కేరోజా నడుంబిగించారు. ఈమార్గంలో ప్రతి గంటకు నాలుగు రైళ్లు వెళుతుండడంతో అధిక సమయం గేట్ వేసే ఉంటుందని, గేట్ వేసిన ప్రతిసారి ప్రయాణికులు సమస్యలు ఎదుర్కొంటున్నారని స్థానికులు మంత్రికి విన్నవించుకున్నారు. ఈమేరకు మంత్రి మంగళవారం నగరి మున్సిపాలిటీ ఏకాంబరకుప్పం రైల్వేగేట్‌ను, అండర్ బ్రిడ్జిని పరిశీలించారు. రైల్వే అధికారులతో ట్రైన్ రాకపోకలకు సంబంధిత అంశాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ రైల్వే గేట్ వద్ద రాకపోకల సమస్యకు పరిష్కార మార్గంగా అండర్ బ్రిడ్జిని సిద్ధం చేస్తామన్నారు. మట్టితో పూడిపోయిన అండర్ బ్రిడ్జిని ప్రస్తుతం శుద్ధీకరిస్తామని, సదరన్ రైల్వే అధికారులతో మాట్లాడి రైల్వే అండర్ బ్రిడ్జికింద రోడ్ వేసి నీళ్లు నిల్వచేరకుండా ఏర్పాట్లు చేయిస్తామన్నారు. యుద్ధప్రాతిపధికన అండర్‌బ్రిడ్జి శుద్ధీకరణ పనులు ప్రారంభించారు. కౌన్సిలర్లు భూబాలన్, బాబు, మురుగ, నాయకులు వినోద్, ఇళంగో, తనికాచలం పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి'

ప్రజాశక్తి- సోమల: ప్రపంచం మొత్తం సేంద్రీయ వ్యవసాయం ఆరోగ్యకరమైన సమాజం కోసం మొగ్గు చూపుతోందని ఇందుకోసం రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపించి తొలుత రైతుల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆపై ప్రజల ఆరోగ్యం కోసం సేంద్రీయ వ్యవసాయం చేసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం కోసం కృషి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులను కోరారు. మంగళవారం శ్రీశక్తి భవన్‌లో ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమైన సమాజంపై రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ ప్రపంచం చూపు ప్రకృతి వ్యవసాయం వైపు అన్న నినాదంతో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ రసాయనిక వ్యవసాయం వల్ల ప్రజలు రైతులు అనారోగ్యం పాలవుతున్నారన్న ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయం పంటలు ధర ఎక్కువైనా ప్రజలు వాటి వైపే మొగ్గు చూపుతున్నారని తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఉన్నారని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి చూపాలని కోరారు. ఏడిఏ శివకుమార్, వైస్ ఎంపీపీ ప్రభాకర్, మండల వ్యవసాయ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

పాపిరెడ్డిపల్లెలో వ్యవసాయ ప్రదర్శన

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు గంగాధర నెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ ప్రదర్శనతోపాటు ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అధికారులు పరిశీలించి వాటి విషయంగా కాలేజీ విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు తెలుసుకున్నారు. ఎస్వీ వ్యవసాయ కాలేజ్ అసోసియేట్ డీఎన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఎడిఆర్ డాక్టర్ రమణ , జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్‌రెడ్డి, నగరి ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, ఎస్వీ కాలేజ్ ఎడి డాక్టర్ జ్యోత్స్న, శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, నాగమణి, ఏవో వందన, సర్పంచ్ పార్థసారధి రెడ్డి, ఎంపీటీసీ భారతి, వివిఎ చక్రవర్తి పాల్గొన్నారు.

'డిప్యూటీ సీఎంకి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి'

ప్రజాశక్తి- కార్వేటినగరం: డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామికే జిడినెల్లూరు టికెట్ ఇవ్వాలని మండలం ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామిని 2024లో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. మండల కోఆప్షన్ మెంబెర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ ధనంజయ వర్మ, ధనశేఖర్ వర్మ, ఆదాం, వెంకటరత్నం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

27 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- సోమల

మండలంలోని పెద్దఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా 27మంది గర్భిణీ స్త్రీలకు వైద్యాధికారి బాలాజీ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలను నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యుల సలహాలను పాటించాలని సూచించినట్లు తెలిపారు. ఎంపీహెచ్‌ఈఓ ఆంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

కుప్పం: ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం కుప్పం మండల పరిధిలోని వానగుట్టపల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ట్రస్టు వైద్యులు డాక్టర్ మధు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించిందని ఈ శిబిరంలో సుమారు 85మంది స్థానికులు పాల్గొన్నారని, వీరందరికీ వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను సైతం అందించడం జరిగిందన్నారు.

రూటా క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరుఅర్బన్: ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రోటా క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఈవో విజయేంద్ర రావు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రతి విద్యార్థి బడిలోనే ఉండాలని, సమస్యలు తీర్చడానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లా అధ్యక్షులు మునీర్ అహ్మద్, తప్రధాన కార్యదర్శి మొహమ్మద్ సాలేహా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు రబ్బానీ, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో జల్లికట్టు

బైరెడ్డిపల్లి: మండలంలోని చప్పిడిపల్లి పంచాయతీ పరిధిలోని గంగాపూర్ గ్రామ సమీపాన మంగళవారం జల్లికట్టు నిర్వహించారు. చిత్తూరు జిల్లాతోపాటు, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి భారీ ఎత్తున ఎద్దులు గ్రామానికి చేరుకుని జల్లికట్టులో పాల్గొన్నాయి. ఈసందర్భంగా జరిగిన చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది.

ఇరికిపెంటలో గ్రామసభ

సోమల: మండలంలోని ఇరికిపెంట రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, హౌసింగ్ శాఖల ద్వారా నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనులను పరిశీలించి నివేదికలను సిద్ధం చేసి గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజల నుండి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, ఏపీవో దినకర్, కార్యదర్శి మేనక, జేఈ రెడ్డప్ప, డిఆర్‌పి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో పేదలకు కార్పొరేట్ వైద్యం

యాదమరి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాధవరం సర్పంచ్ రవి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మాధవరం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని తెలిపారు. సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, యాదమరి వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్, సురేఖ, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం..!

రామకుప్పం: మండల పరిధిలోని రామాపురం తాండ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త గోపాల్‌నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం టిడిపి నేతలు, కార్యకర్తలు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆదేశాలతో తక్షణ సాయంగా రూ.10 వేలను కుటుంబ సభ్యులకు అందించారు. రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, కామరాజ్ నాయక్, మనోహర్ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా 9వ తేదీ గర్భిణీలకు డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి, సూచనలు సలహాలు అందిస్తారు. ఈసందర్భంగా మండల పరిధిలోని గర్భిణీ స్త్రీలకు మహతి ఫౌండేషన్ నాగరాజు సహకారంతో ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రతినెలా ఉచితం పౌష్టికాహకారాన్ని పంపిణీ చేశారు.

వాకర్స్ అసోసియేషన్

వెదురుకుప్పం: మండలంలో నూతనంగా వాకర్స్ అసోసియేషన్‌ను ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా నడింపల్లి యువరాజు, సెక్రటరీగా గురువర్మని నియమించినట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ మురళి మోహన్ మంగళవారం తెలిపారు. అధ్యక్షులు నడింపల్లి యువరాజు మాట్లాడుతూ త్వరలోనే నూతన సభ్యులను ఎంపిక చేసి అసోసియేషన్ రిజిస్టర్ చేస్తామని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రెటరీ ప్రదీప్ కుమార్, జిల్లా వ్యాధినిరోధక ఆఫీసర్ డాక్టర్ పి.రవిరాజు, వాకర్స్ అసోసియేషన్ మాజీ ఏరియా వైస్‌ప్రెసిడెంట్ కోనేటి రవిరాజు, నడింపల్లి రోహిత్ పాల్గొన్నారు.

పంచాయతీలో 'ఇంటింటికీ టిడిపి'

బైరెడ్డిపల్లి: మండలం నెల్లిపట్లలో మాజీ మంత్రి అమరనాథ రెడ్డికి ఘన స్వాగతం లభిచింది. మంగళవారం ఇంటింటికీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పర్యటించారు. పంచాయతీ పరిధిలోని నల్లగుట్లపల్లి, ఓటేరుపాళ్యం, ఆర్‌కే.దిన్నె, తిమ్మయ్యగారిపల్లి, కక్కనూరు, మాదిగపల్లి, కురువూరు, హరిజనవాడ, నెల్లిపట్లలలో ఆయన పర్యటించారు. పలుచోట్ల తెలుగుదేశం పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, జయన్న, రమేష్ రెడ్డి, విల్వనాథ్, మునస్వామి పాల్గొన్నారు.

బంగారుపాలెం: అధికారం చేపట్టిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని పూతలపట్టు నియోజకవర్గం తెలుగుదేశం ఇంచార్జ్ మురళీమోహన్ తెలిపారు. మండలంలోని నల్లంగాడు గ్రామంలో భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమం మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, సుదర్శనం నాయుడు, వంశీ చౌదరి, రాజమాణిక్యం, శివగురు స్వామి పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబంపై డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణాన్ని పావుగా వాడుకొని రాజకీయ లబ్ధి కోసం రిలయన్స్ సంస్థను, కాంగ్రెస్ పార్టీని ముద్దాయిగా చేసి, నేడు అదే రిలయన్స్ సంస్థ భాగస్వామి నేతానియాను రాజ్యసభకు పంపింది మీరు కాదా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించి సుమారు 15 సంవత్సరాలు కావస్తున్నా ఆయన మరణాన్ని వక్రీకరించి మళ్ళీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని అన్నారు. సోనియా గాంధీపై నారాయణస్వామి చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిన్న హైదరాబాద్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లు రవి డిప్యూటీ సీఎం పై కేసు పెట్టడం జరిగిందన్నారు.

పంటలపై అడవి పందుల దాడి



ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని అగరం గ్రామ పంచాయతీకి చెందిన లక్ష్మీపతి అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను సోమవారం రాత్రి అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. మొక్కజొన్న కంకులను పూర్తిగా తినేసి, మొక్కలను తొక్కి నాశనం చేశారు. పందుల దాడి వలన రూ.15వేలు పంట నష్టం వచ్చిందని రైతు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించిన పంట నష్టాన్ని అందించాలని కోరారు.

BEFORE THE HONBLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (III- SMALL CAUSES COURT) AT CHENNAI

O.P.No: 4270 of 2022

E.Rajkumar
S/o. **D. Elumalai** … Petitioner
-Vs-
1.**The New India Assurance Company Ltd.**
2. **S.Ismail,** S/o **S.Mastham**, No.20-2-540A, Maruthi Nagar, Korlagunta, Tirupati, Chittoor District, Andhra Pradesh- Pin 517 501.
3. **S.Gurunatham,** S/o **S.Chandra,** Challavaripalli, Bodireddivaripalli, Pulicherla, Chittoor District, Andhra Pradesh- Pin 517 102.
…Respondents

NOTICE

Please take notice that the above petition is posted for your appearance (3rd Respondent) before the Hon'ble III-SMALL CAUSES COURT on **23.01.2024** at **10.30 AM**. Therefore, you are hereby requested to be present on that day either in person or through an advocate or otherwise orders will be passed in your absence.

N.Elumalai
Counsel for petitioner